క్లుప్తంగా

పెద్దమ్మ తల్లికి బోనాలు



బోనాలతో వస్తున్న భక్తులు

ఇల్లెందు: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని కొత్త కాలనీకి చెందిన ప్రజలు పెద్దమ్మ తల్లి బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. బుధవారం కొత్తకాలనీకి చెందిన శివశక్తి దండు సారయ్య(సారిక) ఆధ్వర్యంలో విభిన్నవేషాలతో అలంకరించిన బోనాలతో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సారయ్య (సారిక) అలంకరించిన బోనం, పూనకంతో ముందుకు సాగగా భక్తులు అమ్మవారిని ఆరాధిస్తూ తరలివెళ్లారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ తన బృందంతో బోనంతో తరలివెళ్లి అమ్మవారి ఆశీర్వాదాలు అందుకున్నారు.

జేకే ఓసీ పరిశీలన



పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు రంగనాథ్ తదితరులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ పని ప్రదేశాన్ని టీబీజీకేఎస్ ప్రతినిధి బృందం సందర్శించింది. బుధవారం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ బృందం ఓసీలో పర్యటించి క్వారీ, ఓబీ పని పరిస్థితులను ఓసీ యాక్టింగ్ మేనేజర్ శివ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పని ప్రదేశంలోకి వెళ్లి పరిశీలించారు. ఓసీలో ఐదేళ్లుగా ప్రమాదాలు లేకుండా పనులు జరుగుతున్నాయని, ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తాం దని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శాంతి

చుంచుపల్లి: మండలంలోని బాదావత్ తండా గ్రామపంచాయతీలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులకు బుధవారం ఎంపీపీ బాదావత్ శాంతి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలను ప్రభుత్వం సమకూర్చుతోం దన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ సుగుణ, సీడీపీఓ లెనీనా, వార్డు సభ్యులు పోతోజు శారద, బాబు ప్రసాద్, రాజేశ్వరరావు, రెడ్డి, వెంకట్రావు, అనుదీప్, రాంజీ, తోగురు రాజశేఖర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న రవి

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి బాటలో పయనిస్తుందని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ జి.రవి అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమరారం, పోలారం, పోచారం గ్రామాలలో ఆయన విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలపై ఇప్పటికే పార్టీ పెద్దలు చేసిన పలు డిక్లరేషన్లను ప్రజలకు వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆజ్మీర రవి, ఇస్లావత్ సతీష్, నవీన్, పసిక తిరుమల్, ధరావత్ కృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిని అడ్డుకున్న ప్రజలు

ఇల్లెందురూరల్: ప్రతినెల విద్యుత్ మీటర్ రీడింగ్ సేకరించాల్సిన ట్రాన్స్‌కో అధికారులు రెండు నెలలకోమారు రావడం వల్ల ప్రభుత్వ సబ్సిడీలను తాము కోల్పోతున్నామని మండలంలోని పోచారం తండా పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల తరువాత విద్యుత్ మీటర్ రీడింగ్‌కు వచ్చిన ట్రాన్స్‌కో అధికారులను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎస్టీలకు తక్కువ రీడింగ్ ఉన్నవారికి ఉచిత విద్యుత్ అమలు చేస్తోందని, రెండు నెలలకోమారు రీడింగ్ తీయడం వల్ల ఆ అవకాశం కోల్పోతున్నామని వాపోయారు. ప్రతినెలా రీడింగ్‌కు రావాలని, లేదంటే రీడింగ్‌కు అనుమతించబోమన్నారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు వెనుదిరిగారు.

'సర్కారు'చదువులు సాగేదెట్లా..?

- భయం గుప్పిట్లో విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు
- ప్రారంభోత్సవానికి నోచుకోని అదనపు తరగతుల భవనం
- పట్టించుకోని అధికారులు



నూతన భవనం ప్రారంభించాలని కోరుతున్న విద్యార్థులు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో శిథిలావస్థ భవనంలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. ప్రమాదకరంగా ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు భయంభయంగా గడుపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల భవనం శిథిలం కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతోంది. ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా తరగతి గదులు తడిసి ముద్ద అవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు మొత్తం 120 మంది ఉన్నారు. శిథిల భవనంలో ఐదు తరగతి గదులు ఉండగా ఇందులో రెండు గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిగిలిన మూడు తరగతి గదులు అంతంతమాత్రంగా ఉండగా వర్షం వస్తే కురుస్తాయి. ఈ రెండు తరగతి గదులతోపాటు, మరో భవనంలో ఆఫీస్ రూమ్, వరండా ఉన్నాయి. ఆఫీస్ రూమ్, వరండాలో విద్యాబోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాల విద్యను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరయ్యాయి. అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులకు ఏడాది క్రితం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ శంకుస్థాపన చేశారు. పనులు పూర్తయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టాల్సిన కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టలేదు. గతంలో పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ కూలిపోవడంతో, వర్షం వచ్చినప్పుడు రోడ్డు మీది వరదనీరంతా పాఠశాల ఆవరణంలోకి వచ్చి మోకాళ్ల లోతు నిలుస్తున్నాయి. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాలంటే వర్షపు నీటిలో నుంచే వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం తెచ్చిన కంకర, రాళ్లు, ఇటుకలు, పగలగొట్టిన శిథిలాలను అడ్డగోలుగా పాఠశాల ఆవరణంలో పోశారు. వీటిని తొలగించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఆవరణమంతా అస్తవ్యస్తంగా ఉంది. పాఠశాలలోని వంట గది సైతం శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కూలుతుందోనని మధ్యాహ్న భోజన వర్కర్లు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఉన్న బడికి పిల్లలను ఎలా పంపించాలని, ప్రమాదం పొంచి ఉందని తెలిసి కూడా అధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించి, ప్రమాదం జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

బడికి రావాలంటే భయంగా ఉంది



శిథిలావస్థ భవనంలో తరగతులు నిర్వహిస్తుండటంతో ఎప్పుడు కూలిపడుతుందోనని భయంగా ఉంది. వర్షం వస్తే తరగతి గదులు తడవడంతో కూర్చునే పరిస్థితి లేదు. అతి కష్టం మీద పట్టాలు వేసుకుని కూర్చున్నా స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. అందుకే బడికి రావాలంటే భయంగా ఉంది.

– మందా రీతు, 5వ తరగతి

కొత్త భవనంలోకి మార్చాలి



శిథిలావస్థలో గదులు ఎప్పుడు కూలిపడతాయో తెలియదు. భయంభయంగా తరగతి గదిలో కూర్చుంటున్నాం. కొత్త భవనంలోకి తొందరగా మార్చే విధంగా పెద్దసార్లు చర్యలు తీసుకోవాలి. గ్రౌండ్ మొత్తం వరదనీటితో నిండిపోవడం వల్ల తరగతి గదుల్లోకి రావాలంటే ఇబ్బందిగా ఉంది.

– పోతురాజు సతీష్, 5వ తరగతి

నిర్మాణ పనులు పూర్తి కాలేదు



అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో కాలేదు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పాఠశాల ఆవరణంలో వరద నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. విద్యార్థులకు ఆపద రాకుండా తక్షణం చర్యలు తీసుకుంటాము.

– గుగులోతు వెంకట్, ఎంఈఓ, జూలూరుపాడు

అసెంబ్లీ సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న వెంకటాచారి

పాల్వంచ: వచ్చే ఎన్నికల్లో జాతీయ, ప్రాంతీయ పార్టీలు విశ్వబ్రాహ్మణులకు ఒక్కో పార్టీ ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ సీట్లు కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కాపర్తి వెంకటాచారి అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు 25లక్షల కుటుంబాల ఓటు బ్యాంక్ ఉన్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తమ బలమేంటో చూపిస్తామన్నారు. రాజకీయంగా తమను ప్రోత్సహించాలని, ఇప్పటికే శాసనసభ స్పీకర్‌గా సిరికొండ మధుసూదనాచారి ఉన్నారని, అసెంబ్లీలో కూడా మా బలం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కాసర్ల రామారావు, పెనుదోట సత్యనారాయణ చారి, వారాది సత్యనారాయణ, జుజ్జూరి ప్రభాకరాచారి, సత్యనారాయణ, కటుకోజ్వల సత్యనారయణ, రామోజీ రాయుడు, గోవిందాచారి, తిరుమలాచారి, రామాచారి, రవికాంత్ పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న విజయకుమారి

ఇల్లెందు: సమాజంలో మహిళల పాత్ర కీలకమైందని, కుటుంబంలో ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ముందుకు సాగుతారని సీఎస్‌ఐ చర్చి డోర్నకల్ అధ్యక్ష మండలం పీఠాధిపతులు డాక్టర్ పద్మారావు, విజయకుమారి అన్నారు. బుధవారం ఇల్లెందు సీఎస్‌ఐ చర్చిలో జరిగిన మహిళల సదస్సులో వారు మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో దూసుకెళ్తున్నారని పేర్కొన్నారు. దేవుని పరిచర్యలో వారి పాత్ర అమోఘం అన్నారు. కార్యక్రమంలో కాలువ దేవదాసు, శాంతికుమారి, ఆగస్టీన్ ప్రేమ్‌రాజ్, తోకల యేసురత్నం, చర్చి పాస్టర్ ఫ్రాంక్లిన్, మైత్రి అధ్యక్షురాలు జ్యోతీమోహన్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై గరంగరం

24 గంటల ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారులపై దిష్టిబొమ్మలను దహనం చేశారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను రైతులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో రైతాంగానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది తెలంగాణ ఒక్కటేనన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, తెలంగాణ వచ్చిన తరువాతనే రైతులు క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులను అవమానించిన రేవంత్‌రెడ్డి అన్నదాతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



సింగరేణి(కొత్తగూడెం): రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



జూలూరుపాడులో...



చుంచుపల్లి: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



సుజాతనగర్‌లో...



టేకులపల్లిలో..

అంబులెన్స్ సౌకర్యం కల్పించండి



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పాల్వంచ: ప్రభుత్వాస్పత్రిలో రోగుల కోసం అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఏడాది నుంచి అంబులెన్స్ లేక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అంబులెన్స్ మంజూరు చేయాలని గతంలో పలుమార్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందన లేదన్నారు. పేరుకే పెద్దాస్పత్రి అయినా ఇక్కడ వైద్య సేవలు అంతంతే మాత్రమేనని, కార్పొరేట్ వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, బండి రమణ, కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, కేతిని కుమారి, కాటబోయిన వసుంధర, ఎడెల్లి దుర్గమ్మ పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి



ప్రగతివనం పార్కును పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ప్రగతివనం పార్కును అభివృద్ధి చేయాలని ఏరియా ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి ఏరియా సివిల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన ప్రగతి వనంలోని ఫౌంటెన్, పార్కులోని పలు ప్రాంతాలను పర్యవేక్షించారు. మాట్లాడుతూ.. ఏరియాలోని అధికారులు, కార్మికుల సౌకర్యార్థం ఈ పార్కును ఏర్పాటు చేయటం జరిగిందని, ఇటీవల ఏర్పాటు చేసిన ఫౌంటెన్ పనిచేయటం లేదని పలువురు ఏరియా జీఎం దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఎస్ఈ అచ్యుత రామయ్య, ఈఈ రాజారామ్ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

పాల్వంచరూరల్: మండల పరిధిలోని ప్రభాత్ నగర్, ఎస్టీ కాలనీలో బుధవారం ఉల్వనూరు పీహెచ్‌సీ డాక్టర్ తేజస్విని ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది దోమల మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శంకర్, రామిరెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షం



పొట్ల నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెంరూరల్: ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెం వచ్చిన ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొట్ల నాగేశ్వరరావు స్వగృహంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులు, ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ఆనాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక పీసీసీ అధ్యక్షుడిపై అధికార పార్టీ అసత్య వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఉచిత విద్యుత్‌ను అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విషయాన్ని రేవంత్ రెడ్డి చెబితే ఆ మాటలను తప్పుదారి పట్టిస్తున్నారు. రైతులకు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ప్రతిమాటను వక్రీకరిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీ చేస్తామని సీఎం చెప్పి ఏళ్లు గడిచినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు జేబీ.శౌరి, ఎల్‌డీఎం పినపాక కోఆర్డినేటర్ మోతుకూరి ధర్మరావు, ఎంపీటీసీ కసనబోయిన భద్రం, మైనార్టీ సెల్ నాయకుడు గౌస్, ఓబీసీ సెల్‌నాయకులు అల్లాడి నర్సింహా, అజ్మీరా సురేష్‌నాయక్, ఉస్మాన్, సాయి, గౌతం, విగ్నేష్, బట్టు మురళీ, రాజశేఖర్, మధు, కాపశ్రీను, గిరి ప్రసాద్, పవన్, సాయి, ప్రకాష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



ఇల్లెందు: బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలలను మూసివేస్తున్నారని దీనివల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



సుజాతనగర్: రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు



టేకులపల్లిలో విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హక్కులు అడగడం రాజ్యాంగ విరుద్ధం



సమావేశమైన ఆదివాసీ జేఏసీ నాయకులు

ఇల్లెందు: ఏజెన్సీలో గిరిజనేతరులు 5వ షెడ్యూల్ పరిధిలో జీవిస్తూ హక్కులు కావాలని అడగడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ సంఘాల జేఏసీ తెలిపింది. బుధవారం ఇల్లెందు మార్కెట్ యార్డులో జరిగిన ఆదివాసీ సంఘాల సమావేశంలో జేఏసీ నేతలు ఈసం నర్సింహారావు, చింత ఉపేందర్, వట్టం కన్నయ్య, సూర్నబాక సత్యనారాయణ, చాపల రమేష్‌బాబు, ఈసాల రామచంద్రు, ముక్తి కృష్ణ మాట్లాడారు. స్వార్థ రాజకీయ నాయకులు వాళ్ల అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి గిరిజన, గిరిజనేతరుల మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నట్లు ఆరోపించారు. 5వ షెడ్యూల్, 1/70 చట్టం అమలులో ఉన్న ప్రాంతంలో గిరిజనేతరులు వలసలు వచ్చి ఇళ్లు నిర్మించుకుని వందల ఎకరాలు ఆక్రమించుకుని గిరిజనులతో రాజకీయాలు చేస్తూ ఆధిపత్యం చెలాయిస్తున్నారని విమర్శించారు. అఖిలపక్ష రాజకీయ నాయకులు గిరిజనేతరులు కావడంతో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా తమ భావజాలాన్ని వ్యక్తం చేశారని, వాళ్లను ఆదివాసీ ప్రాంతాల నుంచి బహిష్కరించాలన్నారు.

పోడు రైతులకు హక్కు పత్రాలివ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాల్వంచరూరల్: పోడు సాగుదారులకు పట్టాహక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఉల్వనూరు గ్రామపంచాయతీకి చెందిన గిరిజన రైతులు తహసీల్దార్ రంగాప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ పరిధిలో 120మందికి పైగా పోడురైతులు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోలేకపోయారని చెప్పారు. మరికొంత మంది రైతులు చేసుకున్న దరఖాస్తులు తప్పులు దొర్లడం వలన పోడు పట్టాలు రాలేదని ఎమ్మెల్యే వనమా చొరవ తీసుకుని అర్హులైన పోడు సాగుదారులకు పట్టాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో వజ్జ వాసు, కాలం సురేష్, గుగులోతు బద్యా, బానోతు రామచంద్రు, కాలం రత్తమ్మ, చిన్న లక్ష్మి, బిజ్జా ఇవన్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారు..

ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలను వక్రీకరరించారని, బీఆర్‌ఎస్‌వీ దిగజారుడు రాజకీయాలని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. అమెరికాలో మీడియా అడిగిన ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి సమాధానం ఇచ్చే క్రమంలో ఉచిత విద్యుత్ గురించి మాట్లాడిన మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించడం సిగ్గు చేటన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డెక్కుతున్నారని విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



సుజాతనగర్: సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్ ఎదుట నిరసనలో ఎడవల్లి కృష్ణ, నాయకులు



పాల్వంచ: కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇల్లెందురూరల్: విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు